## బేల ఎస్ఐగా నాగ్‌నాథ్

బేల, మే 6: ఆదిలాబాద్ జిల్లా బేల మండల పోలీస్ స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్‌గా నాగ్‌నాథ్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తామన్నారు. అసాంఘిక కార్యక్రమాలు, జూదం, అక్రమ మద్యంపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. ఏదైనా సమస్యలు ఉంటే 100కు డయల్ చేయాలని, అలాంటి వారి విషయం గోప్యంగా ఉంచుతామని పేర్కొన్నారు. ఇక్కడ ఎస్ఐగా పని చేసిన దివ్యభారతి తాంసి పోలీస్ స్టేషన్‌కు బదిలీపై వెళ్లారు.

## ఎరువులు, విత్తనాల డీలర్లకు అవగాహన సదస్సు

గుడిహత్నూర్, మే 6 : ఆదిలాబాద్ జిల్లా గుడిహత్నూర్‌లోని రైతు వేదికలో టాస్క్‌ఫోర్స్ టీమ్ ఆధ్వర్యంలో మంగళవారం ఎరువులు, విత్తనాల డీలర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా టాస్క్‌ఫోర్స్ సభ్యులు, మండల వ్యవసాయాధికారి రమేశ్, ఇన్‌చార్జి తహసీల్దార్ భాగ్యలక్ష్మి, సబ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ మహేందర్ మాట్లాడుతూ నకిలీ విత్తనాలు అమ్మితే శాఖ పరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విత్తనాల పంపిణీలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా సరఫరా చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఈవోలు వెంకటి. ప్రవంతి, సాయిప్రశాంత్, శ్రీధర్, డీలర్లు పాల్గొన్నారు.

## గర్భిణులు, బాలింతలపై ప్రత్యేక దృష్టి సారించాలి

ఇంద్రవెల్లి, మే 6: గ్రామీణ ప్రాంతంలో గుర్తించిన గర్భిణులతో పాటు బాలింతలపై వైద్య సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలని ఇంద్రవెల్లి పీహెచ్‌సీ వైద్యులుశ్రీకాంత్, పూజిత అన్నారు. మంగళవారం ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి పీహెచ్‌సీలో వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలతో వేర్వేరుగా సమావేశం నిర్వహించారు. వేసవిలో వచ్చే వ్యాధులతో పాటు వడదెబ్బ నుంచి రక్షణ పొందడానికి తీసుకోవాల్సిన జాగ్రతల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ సురేశ్ పవార్, జీఎన్ మణి, వైద్య సిబ్బంది, ఆశకార్యకర్తలు పాల్గొన్నారు.

## మహిళల రక్షణకు అనేక చట్టాలు

ఉట్నూర్, మే 6: మహిళలను రక్షించేందుకు అనేక చట్టాలున్నాయని జిల్లా మహిళా సాధికారిత కేంద్రం, శిశు సంక్షేమ శాఖ ఆదిలాబాద్ కోఆర్డినేటర్ యశోద అన్నారు. మంగళవారం ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్‌లోని కుమ్రం భీం ప్రాంగణంలో సమ్మర్ క్యాంప్ విద్యార్థులకు, ఉపాధ్యాయులకు చట్టాలు, సఖీ కేంద్రం సేవలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పలువురు సభ్యులు పాల్గొన్నారు.

## నిలిచిన జొన్నల కొనుగోళ్లు

బోథ్, మే 6: ఆదిలాబాద్ జిల్లా బోథ్ మార్కెట్ యార్డులో మార్క్‌ఫెడ్ సహకార సంఘాల ఆధ్వర్యంలో చేపడుతున్న జొన్నల కొనుగోలు నిలిచిపోయాయి. నిబంధనల ప్రకారం రైతులు జొన్నలు క్వింటాల్‌కు రూ.38 చెల్లించాల్సి ఉంది. అయితే బోథ్ మార్కెట్ యార్డులో హమాలీలు రూ.50 వసులు చేస్తుండడంతో రైతులు మార్కెట్ అధికారులకు ఫిర్యాదు చేశారు. వారు నిబంధనల ప్రకారం తీసుకోవాలని చెప్పిన హమాలీలు వినిపించుకోలేదు. హమాలీల కూలి రేట్ల విషయమై మార్కెట్ కమిటీ చైర్మన్ గంగారెడ్డితోపాటు కార్యదర్శి జిల్లా కలెక్టర్ ఫిర్యాదు చేశారు. రెండు రోజులుగా తూకం వేసే ప్రక్రియ నిలిచిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

## ఫార్మర్ ఐడీ ప్రక్రియ ప్రారంభం

బోథ్, మే 6: బోథ్ మండలంలోని వ్యవసాయ క్లస్టర్ల పరిధిలో వ్యవసాయ విస్తరణాధికారులు ఫార్మర్ రిజిస్ట్రేషన్ నమోదు ప్రక్రియ మొదలుపెట్టారు. రైతుల ఆధార్ కార్డు నంబర్‌లో ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. ఆధార్‌కు లింక్ ఉన్న మొబైల్ నంబర్‌కు ఓటీపీ ద్వారా నమోదు పూర్తి చేసి రైతులకు ఐడీ కార్డులు అందిస్తున్నారు. కార్యక్రమంలో ఏఈవోలు కృష్ణ, శ్యాం సుందర్ రెడ్డి, వాజీద్, సంతోష్ పాల్గొన్నారు.

## దాడిని ఖండిస్తున్నాం

నిర్మల్ అర్బన్, మే 6: విధి నిర్వహణలో ఉన్న పెద్ద అంబర్‌పేట్ సబ్ రిజిస్ట్రార్ రవీందర్ నాయక్‌పై జరిగిన దాడిని తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం తీవ్రంగా ఖండిస్తుందని తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు పీజీ రెడ్డి అన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు తమ విధి నిర్వహణలో ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం పని చేస్తారని అలాంటి వారు ఏమైన తప్పు చేస్తే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయాలి కాని భౌతిక దాడులకు దిగడం దారుణమన్నారు.

## అర్హులందరికీ రాజీవ్ యువవికాసం

దిలావర్‌పూర్, మే 6 : అర్హులైన ప్రతి పేద కుటుంబానికి చెందిన యువకులను రాజీవ్ యువవికాసం పథకం అందిస్తామని ఎంపీడీవో అరుణరాణి సూచించారు. మంగళవారం నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్ ఎంపీడీవో కార్యాలయంలో బ్యాంకు మేనేజర్లు, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీవో గోవర్ధన్, పంచాయతీ ఈవో చంద్రశేఖర్, కార్యదర్శులు, బ్యాంకు మేనేజర్లు పాల్గొన్నారు.

## భూ భారతి అర్జీలు స్వీకరణ

కుంటాల, మే,6 : భూ భారతి పైలట్ మండలం కుంటాల మండలంలోని అంబకంటి, లింబా(బీ), సూర్యపూర్ గ్రామాల్లో మంగళవారం భూ భారతి రెవెన్యూ సదస్సు నిర్వహించారు. అదనపు కలెక్టర్ కిశోర్ కుమార్, ఆర్డీవో కోమల్ రెడ్డి ఆయా గ్రామాల్లో జరుగుతున్న సదస్సులను పర్యవేక్షించారు. కార్యక్రమంలో తహసీల్దార్లు కమల్ సింగ్, ఎజాజ్ అహ్మద్, ప్రవీణ్ కుమార్, సిబ్బంది ఉన్నారు.

## పాకిస్తాన్, బంగ్లా దేశస్తులను తరలించండి

బేల, మే 6: పాకిస్తాన్, బంగ్లా దేశస్తులను ఇక్కడి నుంచి తరలించాలని ఆదిలాబాద్ జిల్లా బేలలో బీజేపీ నాయకులు మంగళవారం డిప్యూటీ తహసీల్దార్ వామన్‌కు వినతి పత్రం అందజేశారు. ఇక్కడ బీజేపీ మండలాధ్యక్షుడు ఇంద్రశేఖర్, దత్త నిక్కం, గణేశ్, నవీన్, రాము, రాకేశ్, మహేశ్, ప్రమోద్ ఉన్నారు.

## ఆపరేషన్ కగార్ నిలిపివేయాలి

ఉట్నూర్, మే 6: రాష్ట్రంలోని కర్రెగుట్టలో జరుగుతున్న ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ జిల్లా ప్రధాన కార్యదర్శి సెడ్మాకి రామారావ్ అన్నారు. మంగళవారం ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్‌లోని ప్రెస్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కర్రెగుట్ట దట్టమైన అడవులలో ఉన్న ఖనిజ సంపదను దోచుకోడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆపరేషన్ కగార్ పేరుతో మవోయిస్టుల ఏరివేత చేపడుతుందన్నారు. దీనికి కోసం హెలిక్యాప్టర్లు, బాంబులు వేయడంతో ఆ పరిసరాల్లో ఉంటున్న ఆదివాసులు భయబ్రాంతులకు గురవుతున్నారన్నారు. ఆదివాసీ ప్రాంతాల్లో ప్రశాంతమైన వాతావరణం కల్పించడానికి ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలని కోరారు. సమావేశంలో నాయకులు ఇంద్రు, కుమ్ర జైతు, పూసం ఇస్రు, గోవింద్‌రావ్, దేవ్‌రావ్ పాల్గొన్నారు.

## దెబ్బతిన్న ఇళ్లు, గొర్రెలషెడ్డు

దస్తురాబాద్, మే 6 : రేవోజిపేట గ్రామంలో సోమవారం రాత్రి వీచిన గాలులకు కోల బుచ్చవ్వ రైతుకు చెందిన గొర్రెల షెడ్డు పైకప్పు దెబ్బతింది. రేకులు కొట్టుకుపోయాయి. రూ,2 లక్షల నష్టం వాటిల్లిందని ప్రభుత్వం ఆదుకోవాలని ఆమె కోరారు. అలాగే గొడిసేర్యాల గ్రామంలో గడ్డి రాజవ్వకు చెందిన ఇల్లు పాక్షికంగా దెబ్బతిని, రేకులు కొట్టుకుపోయాయి. ఆర్ఐ ఆర్తీ దెబ్బతిన్న ఇల్లును పరిశీలించారు.



# పెన్‌గంగలో జలం లేక ఇబ్బంది

ఆదిలాబాద్ జిల్లా భీంపూర్ మండల సరిహద్దు పెన్‌గంగ ఒడ్డున గుబిడి, గోముత్రి, అంతర్గాం, వడూర్, గొల్లగడ్, తాంసి(కే) గ్రామాలతో అటు మహారాష్ట్ర రైతులు, పశుపోషకులు పెన్‌గంగ వట్టిపోయి ఇబ్బందులు పడుతున్నారు. పెన్‌గంగలో ఒక ప్రాంతంలో నీరు ,మరో ప్రాంతంలో తేలిన రాళ్లు కనిపిస్తున్నాయి. తీవ్రమైన ఎండలతో మండల సరిహద్దు పెన్‌గంగ భాగంలో ఆ నీరు కూడా వట్టిపోతున్నది. పశువులు పెన్‌గంగలో అక్కడక్కడ ఉన్న నీటితో దాహార్తి తీర్చుకుంటున్నాయి.

- భీంపూర్, మే 6 :

# మార్కెట్ యార్డులోనే తిండి, నిద్ర

ఆదిలాబాద్ మార్కెట్ యార్డుకు వివిధ ప్రాంతాల నుంచి రైతులు జొన్నలను విక్రయించడానికి తీసుకువచ్చారు. మీ గ్రామానికి సంబంధించిన షెడ్యూల్ లేదని పంటను ఎందుకు తీసుకువచ్చారని కొనుగోలు కేంద్రాల సిబ్బంది ప్రశ్నిస్తూ, కొనుగోళ్లకు నిరాకరిస్తున్నారు. రేపు, మాపు తీసుకుంటామని అంటున్నారని, దీంతో తాము పంటకు కాపలగా ఉంటూ మూడు రోజుల నుంచి ఇక్కడే తిని, నిద్రిస్తున్నామని రైతులు తెలిపారు. తమ పంట కొనుగోలు చేయాలని పలువురు రైతులు సిబ్బందిని వేడుకుంటున్నారు.

- ఆదిలాబాద్ ఫొటోగ్రాఫర్, మే 6



ఆదిలాబాద్ మార్కెట్‌యార్డులో నిద్రిస్తున్న రైతులు

## కేసుల పరిష్కారానికి కృషి చేయాలి



నిర్మల్‌చైన్‌గేట్ : మాట్లాడుతున్న జిల్లా జడ్జి శ్రీవాణి

నిర్మల్ చైన్‌గేట్, మే 6 : కేసుల పరిష్కారానికి పోలీసులు కృషి చేయాలని నిర్మల్ జిల్లా ప్రధాన జడ్జి శ్రీవాణి సూచించారు. జూన్ 14వ తేదీన నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో కేసుల సత్వర పరిష్కారంపై జిల్లా కోర్టు సమావేశ మందిరంలో పోలీసు ఉన్నతాధికారులతో మంగళవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ జిల్లాలో నేరాల అదుపునకు తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. నిర్మల్, ఖానాపూర్, భైంసా కోర్టుల్లో రాజీ మార్గంలో కేసులు పరిష్కరించుకోవాలని సూచించారు. సమావేశంలో ఎస్పీ జానకిషర్మిల, జడ్జిలు, ఏఎస్పీ అవినాశ్‌కుమార్, నిర్మల్ పట్టణ, రూరల్ సీఐలు ప్రవీణ్‌కుమార్, కృష్ణ, జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల ఎస్ఐలు, పీపీలు, న్యాయవాదులు పాల్గొన్నారు.

## అత్యధిక కేసులు పరిష్కరించాలి



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రభాకర్‌రావు

ఎదులాపురం, మే 6 : రాజీమార్గంలో కేసులను పరిష్కరించేందుకు లోక్ అదాలత్ వేదికగా నిలుస్తున్నదని, గతంలో కంటే ఎక్కువ సంఖ్యలో కేసులు పరిష్కరమయ్యేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆదిలాబాద్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి కే ప్రభాకర్ రావు అన్నారు. జూన్ 14వ తేదీన జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్న నేపథ్యంలో మంగళవారం జిల్లా కోర్టులో పోలీసులతో సమావేశం నిర్వహించారు. స్టేషన్ల వారీగా పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలు తెలుసుకున్నారు. రాజీపడదగ్గ కేసులను స్టేషన్ల వారీగా రికార్డులను పరిశీలించి కక్షిదారులతో మాట్లాడాలని సూచించారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు కుమార్ వివేక్, లక్ష్మీకుమారి, హుస్సేన్, డీఎస్పీలు జీవన్ రెడ్డి, నాగేందర్, సీఐలు, ఎస్ఐలు, కోర్టు కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

## విధులను నిర్లక్ష్యం చేస్తే చర్యలు

ఇంద్రవెల్లి, మే 6 : గ్రామీణ ప్రాంతంలోని పీహెచ్‌సీకి వచ్చే ప్రజలకు మెరుగైన వైద్యం అందించడంతో పాటు విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆదిలాబాద్ డీఎంహెచ్‌వో రాథోడ్ నరేందర్ వైద్య సిబ్బందికి హెచ్చరించారు. మంగళవారం ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లిలోని పీహెచ్‌సీని తనిఖీ చేశారు. పలు రకాల రికార్డులు పరిశీలించి వైద్య సేవలపై ఆరాతీశారు. ఆయన వెంట డాక్టర్లు శ్రీకాంత్, పూజిత, సిబ్బంది ఉన్నారు.

## రోగులకు నాణ్యమైన భోజనం అందించాలి

నిర్మల్ చైన్‌గేట్, మే 6 : రోగులకు నాణ్యమైన భోజనం అందించాలని నిర్మల్ డీఎంహెచ్‌వో రాజేందర్ సూచించారు. నిర్మల్‌లోని మాతాశిశు ఆరోగ్య కేంద్రం, ప్రధాన దవాఖానను సందర్శించారు. భోజనం మెనూను పరిశీలించారు. దవాఖానలో అడ్మిట్ అయిన పలువురు గర్భిణులకు అందిస్తున్న మెనూ ఎలా ఉందని అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఆయన వెంట జిల్లా డిప్యూటీ మీడియా విస్తరణ అధికారి బారె రవీందర్, నర్సింగ్ సూపరింటెండెంట్ ధనలక్ష్మి, ఉన్నారు.

## బాల్య వివాహాన్ని అడ్డుకున్న అధికారులు

తానూర్, మే 6 : నిర్మల్ జిలా తానూర్ మండలంలోని బోసి గ్రామంలో బాల్య వివాహం జరగబోతున్న సమాచారం అందుకున్న బాలల పరిరక్షణ అధికారులు సకాలంలో స్పందించి వివాహాన్ని అడ్డుకున్నారు. బోసి గ్రామానికి చెందిన 14 ఏళ్ల మైనర్ బాలికకు వివాహం జరుగుతున్నట్టు సమాచారం అందడంతో బాలల సంక్షేమ శాఖ, పోలీసు అధికారులు మంగళవారం ఘటన స్థలానికి చేరుకున్నారు. ముధోల్ సీఐ మల్లేశ్, ఎస్ఐ నవనీత్ రెడ్డి, సీడీపీవో సరోజిని, ఏసీడీపీవో నాగలక్ష్మి, బాలల పరిరక్షణ సిబ్బంది అంగన్‌వాడీ కార్యకర్తలు అక్కడికి చేరుకుని వివాహాన్ని నిలిపివేశారు. ఇరు కుటుంబ సభ్యులకు కౌన్సెలింగ్ నిర్వహించి బాల్య వివాహం వల్ల ఏర్పడే దుష్పరిణామాలను వివరించారు. అనంతరం ఇద్దరి కుటుంబాల నుంచి కూతురు మేజరయ్యే వరకు జరుపబోమని హామీ పత్రాలు రాసుకున్నారు. ఈ సంఘటనపై స్పందించిన స్థానికులు బాలిక భవిష్యత్ దృష్ట్యా చర్యలు తీసుకున్న అధికారులకు అభినందనలు తెలిపారు.

## రైతు కుటుంబానికి నాయకుల పరామర్శ

దిలావర్‌పూర్, మే 6 : నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్ మండలం మాడెగాం గ్రామంలో రైతు పులిండ్ల విజయ్‌కి చెందిన 3 లేగ దూడలు జొన్న లేప తిని సోమవారం మృతి చెందాయి. ఈ విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు ఏలాల చిన్న రెడ్డి, జిల్లా పరిషత్ మాజీ కోఆప్షన్ సభ్యుడు డాక్టర్ సుభాష్‌రావు కలిసి బాధిత రైతును పరామర్శించారు. మృతి చెందిన లేగ దూడల విలువను రైతును అడిగి తెలుసుకున్నారు. అక్కడి నుంచి సంబంధిత పశువైద్యాధికారితో మాట్లాడారు. ప్రభుత్వ పరంగా ఏమైన ఆర్థిక సహాయం అందుతుందా అని వారు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట నిర్మల్ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ రాథోడ్ అశోక్, గుండంపల్లి బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు గంగారెడ్డి, సర్పంచ్ సరిత, రాజు, ఎల్లయ్య పాల్గొన్నారు.

## దవాఖానలు సందర్శన

నిర్మల్ చైన్‌గేట్, మే 6 : నిర్మల్‌లోని మాతా శిశు ఆరోగ్య కేంద్రంతో బస్తీ దవాఖాన, రాంనగర్, బంగల్‌పేట ఆరోగ్య కేంద్రాలను మంగళవారం పారా లీగల్ వాలంటీర్స్ బృందం సందర్శించారు. దవాఖాన పనితీరు, రోగులకు అందుతున్న సేవలు, వైద్యులు, సిబ్బంది అందించే సేవలను పరిశీలించారు. పరిశీలించిన అంశాలను కలెక్టర్, సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా వైద్యాధికారికి రెండు రోజుల్లో నివేదిక సమర్పించనున్నట్లు తెలిపారు. ఇక్కడ వైద్యులు నాగేశ్వర్‌రావు, విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు లింగన్న, నర్సింగ్ సూపరింటెండెంట్ ధనలక్ష్మి, రాజేందర్, జనార్దన్, పోతన్న, గంగాధర్ ఉన్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల దరఖాస్తుల పరిశీలన



సర్వేను పరిశీలిస్తున్న ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా

ఎదులాపురం/తాంసి,మే 6: ఆదిలాబాద్‌లోని కేఆర్‌కే కాలనీ, రామ్‌నగర్, భాగ్యనగర్ కాలనీలోని, తాంసితో పాటు హస్నాపూర్‌లో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల దరఖాస్తుల చెక్ లిస్ట్‌ను మంగళవారం కలెక్టర్ రాజర్షి షా పరిశీలించారు. లబ్ధిదారుల ఇళ్లను పరిశీలించారు. ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి ప్రాథమిక జాబితాలో ఉన్న పేర్లను మరోసారి వెరిఫికేషన్ చేయాలని సూచించారు. అన్ని కోణాల్లో పరిశీలించి లబ్ధిదారుల జాబితాను తయారు చేయాలని మున్సిపల్ కమిషనర్ సీవీఎన్ రాజును ఆదేశించారు. కలెక్టర్ వెంట మున్సిపల్ కమిషనర్ సీవీఎన్ రాజు, మున్సిపల్ సిబ్బంది, వీఆర్వో ఉన్నారు.

### అభ్యాసకుల నమోదును గణనీయంగా పెంచడం లక్ష్యంగా పని చేయాలి

ఎదులాపురం, మే 6: తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ(టీవోఎస్ఎస్) వయోజన విద్య కింద ఉల్లాస్ ప్రోగ్రామ్ ద్వారా నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వం ఆదేశాల మేరకు 2025-26 విద్యా సంవత్సరానికి అభ్యాసకుల నమోదును గణనీయంగా పెంచడం లక్ష్యంగా పని చేయాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రణాళిక కోసం మార్గదర్శకాలతో కన్వర్జెన్స్ మీటింగ్ కలెక్టర్ రాజర్షి షా అధ్యక్షతన సంబంధిత విద్యా శాఖ అధికారులతో కలెక్టరేట్‌లో సమావేశం నిర్వహించారు. విద్యా సంవత్సరానికి ప్రత్యేకంగా ఎస్ఎస్‌సీ కోర్సు కోసం 14 సంవత్సరాల వయస్సు గల పాఠశాల డ్రా పౌట్‌లు, ఇంటర్మీడియట్ కోర్సు కోసం 15 సంవత్సరాల వయస్సు గల కళాశాల డ్రా పౌట్‌లు ఉల్లాస్ ప్రోగ్రామ్‌లో 15 సంవత్సరాల వయస్సు గల అక్షరాస్యులు నమోదు చేయడాన్ని లక్ష్యంగా చేసుకుని అభ్యాసకుల నమోదును గణనీయంగా పెంచడం లక్ష్యంగా జిల్లాలో ఈ కార్యక్రమాన్ని పకడ్బందీగా చేపట్టాలన్నారు. ఈ సదావకాశం వినియోగించుకొని విద్యావంతులు కావాలని ఓపెన్ స్కూల్ ఆకాంక్ష అని తెలిపారు. కార్యక్రమంలో డీఈవో శ్రీనివాస్, డీఐఈవో గణేశ్, అధికారులు, ఉపాధ్యాయులు, ట్రైనర్లు పాల్గొన్నారు.

# శాస్త్రీయ పద్ధతిలో పంటల సాగుతో లాభాలు

ఎదులాపురం, మే 6 : శాస్త్రీయ పద్ధతిలో పంటలు సాగు చేస్తే లాభాలు అధికంగా వస్తాయని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త రాజశేఖర్ అన్నారు. రైతు ముగింట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆదిలాబాద్ మండలంలోని లచ్చంపూర్ గ్రామంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఇందులో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు రైతులకు సాగు సంబంధిత అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్త రాజశేఖర్ మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో రైతులు అధికంగా రసాయన ఎరువులు వాడడంతో భూమి తన సాంద్రత కోల్పోయే ప్రమాదం ఉందని అన్నారు. పంటలకు పురుగుల మందులతో బయో మందులను కలిపి వాడొద్దని సూచించారు. పురుగుల మందులు వాడే ముందు సమగ్ర యాజమన్య పద్ధతులు అనుసరించాలన్నారు. విత్తనాలను లైసెన్స్ ఉన్న దుకణాల్లోనే కొనాలని సూచించారు. రసీదులు తప్పని సరిగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు శిచరణ్, మోహన్‌దాస్, మండల వ్యవసాయ శాఖ అధికారి ప్రమోద్ రెడ్డి. మండల పశువైద్యురాలు లావణ్య. ఏఈవో కీర్తి, పంచాయతీ కార్యదర్శి మహేశ్, రైతులు పాల్గొన్నారు.



తలమడుగు: మాట్లాడుతున్న శాస్త్రవేత్తలు

తలమడుగు, మే 6 : ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలంలోని లచ్చంపూర్ గ్రామంలో ఆదిలాబాద్ కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు, అధికారులు మాట్లాడుతూ తక్కువ యూరియా వాడి సాగు ఖర్చును తగ్గించాలన్నారు. అవసరం మేరకు రసాయనాలు వాడాలని సూచించారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు డాక్టర్ కే రాజశేఖర్, డాక్టర్ డీ మోహన్ దాస్, డాక్టర్ జీ శివచరణ్, మండల వ్యవసాయాధికారి ప్రమోద్ రెడ్డి, వ్యవసాయ విస్తరణాధికారి కీర్తి, మండల పశు సంవర్ధక శాఖాధికారి లావణ్య, గ్రామ పటేల్ పాల్గొన్నారు.

# బ్లాక్ కరెన్సీ ముఠా అరెస్టు

- నిందితులను అరెస్టు చేసిన వెల్గటూర్ పోలీసులు



బ్లాక్ కరెన్సీ ముఠాను అరెస్టు చేసి నిందితులను హాజరు పరిచిన జగిత్యాల డీఎస్పీ రఘుచందర్

వెల్గటూర్, మే 16: బ్లాక్ కరెన్సీ పేరిట అమాయక ప్రజలను మోసం చేసే ముఠాను పోలీసులు పట్టుకొని అరెస్టు చేశారు. వెల్గటూర్ పోలీస్ స్టేషన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ రఘుచందర్ నిందితుల అరెస్టు చూపి, వివరాలు వెల్లడించారు. వెల్గటూర్ మండలం చెగ్యాం గ్రామానికి చెందిన రామిళ్ల విజయ్‌సాగర్ తనకు తెలిసిన బీర్‌పూర్ మండలం తుంగూర్‌కు చెందిన కంది నరేశ్‌ను జగిత్యాలలో కలిసినప్పుడు అదే గ్రామానికి చెందిన పాలాజి శ్రీనివాస్‌ను పరిచయం చేశాడు. కాగా, పాలాజి శ్రీనివాస్ మిత్రులైన నిర్మల్ జిల్లా దస్తూరాబాద్‌కు చెందిన ఎంబడి మల్లేశ్, మగ్గిడి కిషన్, కడెంకు చెందిన అల్తాపు రాజుకు కెమికల్ కంపెనీలు ఉన్నాయని, నల్ల రంగులో ఉన్న రూ. 500 నకిలీ నోట్లను రసాయనంలో ముంచితే ఒరిజినల్ నోట్లుగా మారుతాయని తెలిపాడు. దీంతో విజయ్‌సాగర్‌ను గత ఫిబ్రవరి 5న కంది నరేశ్, పాలాజి శ్రీనివాస్ జన్నారం మండలం ఇందనపల్లి గ్రామానికి తీసుకెళ్లి, ఎంబడి మల్లేశ్, అల్తాపు రాజు, మగ్గిడి కిషన్‌ను పరిచయం చేశారు. మగ్గిడి కిషన్ తన వద్ద ఉన్న కొన్ని నల్ల రంగు నోట్లను ఓ రసాయనంలో ముంచి తీయగా ఒరిజినల్ నోట్లుగా మారాయి. ఇట్టి నోట్లను సులభంగా మార్చి తక్కువ సమయంలో ఎక్కువ సంపాదించవచ్చని నమ్మబలికారు. రూ. లక్షకు 7 లక్షలు రసాయనంలో ముంచిన నోట్లు ఇస్తామని, రూ. 7 లక్షలు అసలు నోట్లు ఇస్తే 35 లక్షలు ఇస్తామని చెప్పారు. ఈ ఐదుగురితో పాటు కడెంకు చెందిన వారి మిత్రుడు బియ్యాల నవీన్‌ను తీసుకొని కారులో మార్చి 4న విజయ్‌సాగర్ ఇంటికి వచ్చారు. ముందుగా అనుకున్న ప్రకారం విజయ్‌సాగర్ తన వద్ద ఉన్న రూ.7 లక్షలు ఎంబడి మల్లేశ్‌కు ఇచ్చాడు. తనకు ఇవ్వవలసిన రూ.35 లక్షలు నల్ల రంగు నోట్లను కోటిలింగాలకు వస్తే ఇస్తామని తెలుపగా విజయ్‌సాగర్ తన కారులో వెళ్లాడు. అక్కడ నిందితులు వారి కారు బ్యాక్ సీట్లో పిల్లలు ఆడుకునే రూ. 500 బొమ్మ కరెన్సీ నోట్లను బ్యాగ్‌లో చూపించారు. అదే సమయంలో అక్కడకు కడెంకు చెందిన రాజశేఖర్, జన్నారంకు చెందిన కార్తీక్ పోలీసులమని వచ్చి బెదిరించారు. మేము పోలీసులతో మాట్లాడుతామని చెప్పి పక్కకు తీసుకెళ్లి ఏదో మాట్లాడినట్లు చేసి రూ. 7 లక్షలు తీసుకుని వారు వచ్చిన కారు, బైక్‌పై అక్కడి నుంచి పరారయ్యారు. కాగా, విజయ్‌సాగర్ వారికి ఫోన్ చేసి డబ్బులు అడుగగా చంపుతామని బెదిరించడంతో ఈనెల 2న వెల్గటూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. కాగా, మంగళవారం రాయపట్నం మీదుగా కరీంనగర్ వెళ్తున్నారనే పక్కా సమాచారంతో వెల్గటూర్ మండలం స్తంభంపల్లి శివారులోని హరిత హోటల్ వద్ద వాహనాల తనిఖీలు చేపట్టారు. శ్రీనివాస్, రాజు, మల్లేశం, రాజశేఖర్, కంది నరేశ్‌ను పట్టుకున్నారు. వారి వద్ద నుంచి కారు, 5 సెల్ ఫోన్లు, రూ. 2 లక్షల 4 వేల నగదు, ఆరు నల్ల రంగు నోట్లు, పిల్లలు ఆడుకునే 500 బొమ్మ నోట్లు, బైక్ స్వాధీనం చేసుకున్నారు. కాగా, కిషన్, నవీన్, కార్తీక్ పరారీలో ఉన్నారు. వీరందరిపై ఇప్పటికే పలు పోలీసు స్టేషన్లలో పలు కేసులు ఉన్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ధర్మపురి సీఐ రాంనర్సింహారెడ్డి, ఎస్ఐలు ఉమాసాగర్, ఉదయ్‌కుమార్, శ్రీధర్‌రెడ్డి, కానిస్టేబుల్ కిరణ్, ఆదిల్, తదితరులు పాల్గొన్నారు.

## ఆయిల్ మిల్లులో అగ్ని ప్రమాదం



కాలిపోతున్న ఆయిల్ మిల్లు

భైంసా, మే 6 : నిర్మల్ జిల్లా భైంసాలో సోమవారం రాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో శివశంకర్ ట్రేడింగ్ కంపెనీలో మిషన్, షెడ్డు దగ్ధమయ్యాయి. భారీ ఆస్తి నష్టం సంభవించింది. ఫర్నిచర్, ఇన్వర్టర్ కాలిపోయింది. అటువైపు వెళ్తున్న వారు మంటలను చూసి అగ్నిమాపక శాఖకు సమాచారం ఇచ్చారు. దీంతో ఫైరింజన్ వెళ్లి మంటలను ఆర్పివేశారు. అప్పటికే అన్ని కాలిపోయి పూర్తి నష్టం వాటిల్లినట్లు యజమాని శంకర్ బచ్చువార్ తెలిపారు.

## రెండిళ్లలో దొంగతనం

సోన్, మే 6: నిర్మల్ జిల్లా సోన్ మండలం మాదాపూర్ గ్రామంలోని సోమవారం రాత్రి రెండు ఇళ్లలోకి గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి దొంగతనానికి పాల్పడినట్లు ఎస్ఐ గోపి తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన శేక్ అక్బర్ సోమవారం రాత్రి తన ఇంటి స్లాబుపై నిద్రపోయారు. ఇంటికి వేసి ఉన్న తాళంను గుర్తు తెలియని వ్యక్తులు పగులగొట్టి ఇంట్లోకి చొరబడి బంగారం, పది తులాల వెండితో పాటు నగదును ఎత్తుకెళ్లారు. అదే విధంగా గ్రామానికి చెందిన భారత భర్త గల్ఫ్‌లో ఉండడంతో పక్కింటిలో నిద్రపోయేందుకు వెళ్లగా గమనించిన దొంగలు వీరి ఇంట్లోకి చొరబడి బంగారం ఎత్తుకెళ్లినట్లు వివరించారు. పోలీసులకు ఫిర్యాదు చేయగా సీఐ గోవర్ధన్ రెడ్డి, ఎస్ఐ గోపీ సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## భార్యపై హత్యాయత్నం : భర్త అరెస్టు

భైంసాటౌన్, మే 6 : భార్యపై హత్యాయత్నానికి పాల్పడిన భర్తపై కేసు నమోదు చేసి, అరెస్టు చేసిన ఘటన నిర్మల్ జిల్లా భైంసా మండలంలోని ఇలేగాం గ్రామంలో చోటు చేసుకుంది. రూరల్ ఎస్ఐ శంకర్ తెలిపిన వివరాల ప్రకారం .. పార్వతి రవి, స్వాతి ఊరి చివర కొత్త కాలనీలో నివాసముంటున్నారు. కొంతకాలంగా భర్త ప్రవర్తన నచ్చక ఇద్దరి మధ్య మనస్పర్థాలు ఏర్పడ్డాయి. ఈ క్రమంలో సోమవారం రాత్రి రవి భార్యను అకారణంగా సుత్తెతో తలపై బాదాడు. దీంతో తీవ్ర రక్తస్రావం జరిగింది. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్ఐ తెలిపారు.

## ఎమ్మెల్యే చొరవతో తీరిన నీటి సమస్య



బోరుబావి నీటిని చూపిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

బోథ్, మే 6 : ఆదిలాబాద్ జిల్లా బోథ్‌లోని 15వ వార్డులో ఎన్నికల సమయంలో నీటి ఎద్దడిపై ఎమ్మెల్యే జాదవ్ అనిల్‌కు వివరించారు. స్పందించి ఎమ్మెల్యే కాలనీలో బోరుబావి తవ్వించారు. నీరు రావడంతో మోటర్ బిగించారు. మంగళవారం బోరుబావి నీటిని ప్రారంభించారు. మాట నిలబెట్టుకున్న ఎమ్మెల్యేకు కాలనీ వాసులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సురేందర్ యాదవ్, అల్లకొండ ప్రశాంత్, బొడ్డు శ్రీనివాస్, రమణ గౌడ్, ప్రవీణ్, ఎలుక రాజు, వినయ్, లింగారెడ్డి పాల్గొన్నారు.

## తాగునీటి ఎద్దడి నివారించండి

పెంబి, మే 6: మారుమూల గిరిజన గ్రామమైన గుమ్మెన కోలాంగూడ గ్రామంలో తాగునీరు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని గ్రామస్తులు వాపోయారు. మంగళవారం మండల కేంద్రంలోని తహసీల్ కార్యాలయంలో తహసీల్దార్ లక్ష్మణ్‌కు గ్రామంలో తాగునీటి ఎద్దడిని నివారించాలని గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలోకి మిషన్ భగీరథ పైపులేదని, ఉన్న ఒక్క చేతి పంపు ద్వారా నీరు రాకపోవడంతో తాగునీటి ఎద్దడిని తీవ్రంగా ఎదుర్కొంటున్నామన్నారు. అధికారులు పట్టించుకోవడం లేదని వాపోయారు. గ్రామంలో మిషన్ భగీరథ పైపులైన్ ఏర్పాటు చేసి తాగునీటి ఎద్దడి నివారించాలని తహసీల్దార్‌ను కోరారు. ఇక్కడ గ్రామస్తులు టేకం ధర్మ, సీతారాం, గురువయ్య, రాజు, బాలేరావ్ ఉన్నారు.

## విద్యుత్‌పై జాగ్రత్తలు సూచించాలి

ఉట్నూర్, మే 6: విద్యుత్ వాడకం, దానిపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు సూచించాలని ఆ శాఖ చీఫ్ ఇంజినీర్ జేఆర్ చౌహాన్ అన్నారు. మంగళవారం ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ డివిజన్ కార్యాలయ ప్రాంగణంలో విద్యుత్ భద్రత వారోత్సవాలు నిర్వహించారు. సిబ్బంది పాల్గొన్నారు.

## జొన్న లేప తిని ఐదు గొర్రెలు మృతి

ఇచ్చోడ, మే 6: ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలంలోని మాదపూర్ గ్రామంలో మంగళవారం జొన్న లేప తిని ఐదు గొర్రెలు మృతి చెందాయి, మదపూర్ గ్రామానికి చెందిన సాయి రాజేశ్‌కు సంబంధించిన గొర్రెలు జొన్న లేప తిని ఇంటికి వచ్చారు. రాత్రి ఒక దాని తర్వాత మృతి చెందాయి. వీటి విలువ రూ.40 వేలు ఉంటుందని బాధితుడు తెలిపాడు.